ఆంధ్రజ్యోతి




2007 CALENDAR
world Time


## బ్రహ్మాండంగా బోస్టన్ దీపావళి వేడుక



బోస్టన్, నవంబర్ 12 : సర్వజిత్ నామ సంవత్సర దీపావళి పండుగను అమెరికాలోని బోస్టన్ నగర తెలుగు ప్రవాసులు ఇటీవల ఘనంగా జరుపుకున్నారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్ (టీఎజిబి) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భారీ సంఖ్యలో తెలుగువారు హాజరయ్యారు. ఔత్సాహిక కళాకారులు, చిన్నపిల్లల ఆటపాటలతో వేడుకలు బ్రహ్మాండంగా జరిగాయి. ప్రేక్షకుల సౌకర్యం కోసం హాలు బయట టీవీలు ఏర్పాటు చేసి కార్యక్రమం అందరికీ అందేలా టీఎజిబి ఏర్పాట్లు చేసింది.



టీఎజిబి అధ్యక్షుడు శ్రీనివాస్ కాకి స్వాగతోపన్యాసం చేస్తూ... అమెరికా ప్రభుత్వం దీపావళి పండుగను అధికారికంగా గుర్తించిన తరువాత నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం ఇది అని తెలిపారు. టీఎజిబి చేపడుతున్న కార్యక్రమాలను సభికులకు ఆయన వివరించారు. కార్యక్రమానికి ప్రధాన సందాతగా శ్రీమతి అను మైత్ర, సహాయకులుగా వంశీ, చిన్నారులు మానస జయంతి, పృథ్వీ మావూరి సందర్భోచితమైన వ్యాఖ్యలతో సమర్థవంతంగా నిర్వహించారు.

చిన్నారులు అభినయించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి. జానపద, శాస్త్రీయ నృత్య గీతాలు, ఏక పాత్రాభినయం, హాస్య నాటికల్లో చిన్నారులు హుషారుగా పాల్గొన్నారు. విఖ్యాత కళాకారిణి కుమారి మానస ప్రదర్శించిన స్కేట్‌లపై నృత్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. చిన్నపిల్లల ఫ్యాషన్ షో వినూత్నంగా సాగింది.




పెద్దలు కూడా చిన్నారులకు దీటుగా సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాత, కొత్త సినిమాల పాటలతో 'నాడు-నేడు పాటల తీరు' కార్యక్రమంలో ప్రవాసాంధ్ర దంపతులు చేసిన నృత్యాలు హుషారెత్తించాయి. 'సీతాపతి కళ్యాణం' హాస్య నాటిక హాస్యపు జల్లులు కురిపించింది.

డాక్టర్ బాబు, మూర్తి , వాణీ కన్నెగంటి, డాక్టర్ నానారావు, శ్రీనివాస్, పద్మాంజలి కాకి, శేఖర్ నల్లా కార్యక్రమ నిర్వహణకు తమవంతు సాయమందించారు. టీఎజిబి ఉపాధ్యక్షులు డాక్టర్ సూర్యా జయంతి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.